
క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయ అసిస్టెంటెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షిస్తున్న సిబ్బంది

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని సచివాలయం-3లో శుక్ర వారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీస్ డాక్టర్ చాణక్య నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్లు సరళగంగ, సుబ్బరాయుడు ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ



బెంజిమెన్ రాజును సన్మానిస్తున్న దృశ్యం

డోన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ లెక్చరర్ బెంజిమెన్ రాజు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ రఘునందన్, లెక్చరర్‌లు, స్నేహితులు తదితరులు బెంజిమెన్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది నాయక్, భాస్కర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



లైసెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల, ఆకుమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్ద శుక్రవారం ఎస్ఐ రమేష్ రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. కోవెలకుంట్ల, అవుకు, తాడిపత్రికి వెళ్లే వాహనాలను ఆపి లైసెన్స్, ఆర్సీ, రోడ్డు ట్యాక్స్ తదితర రికార్డులను పరశీలించారు. సరైన పత్రాలులేని 20 వాహన చోదకులకు జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు.

డోన్ విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న జోనాథన్

డోన్ టౌన్ : ఎలక్ట్రానిక్ కీ బోర్డుతో ఉత్తమ సంగీతం వాయించి ఇంజినీఎస్ ఛాంప్ వరల్డ్ అవార్డును డోన్ విద్యార్థి జోనాథన్ కైవసం చేసుకున్నారు. మే 30న విజయవాడలోని మెట్రోపాలిటన్ చర్చిలో హల్లేల్ మ్యూజిక్ ఫౌండర్ అగస్టిన్ దండింగి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జోనాథన్ ఉత్తమ ప్రతిభ కనబరచారు. పట్టణానికి చెందిన కొండపోగు ఇసాకు,ఎస్తేరు రాణి దంపతుల మొదటి సంతానం అయిన జోనాథన్ శ్యాంజో స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు జోనాథన్ అభినందించారు.

ధూమపానంతో అనారోగ్యం

బేతంచెర్ల: ధూమ పానం మీ ఆరోగ్యాన్నే కాదు మీ జీవితాన్ని కూడా కాల్చేస్తుందని వైద్యులు చరణ్ రాజు, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యసన ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ధూమపానం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ యువత మేలుకో, వ్యసనాలను మానుకో, కాలక్షేపం కోసం మొదలయ్యే వ్యసనాలు బంగారం లాంటి భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తాయన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం!

- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ
- అనుకూలంగా మారిన ముందస్తు వర్షాలు
- రసాయన ఎరువులు, విత్తనాలు సిద్ధం
- నేటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు(ఫైల్)

డోన్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా మారాయి. దీంతో వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యాడు రైతన్న. ప్రత్యేకించి వర్షాధారంపైపే ఆధారపడిని డోన్ నియోజకర్గంలో దుక్కుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది సాధారణ వర్షపాతం సగటున 1007 మి.మీ ఉండగా, కేవలం 973 మిమీ నమోదు కావడంతో పంటల దిగుబడి ఆశాజనకంగా లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు భారీగా కురుస్తాయనే కోటి ఆశలతో రైతాంగం సాగుకు సన్నద్ధం అవుతున్నాడు. డోన్ నియోజకవర్గంలో 56,920 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో సద్దలు 4,429 హెక్టార్లు, కొర్ర 765 హెక్టార్లు, కంది 24,597 హెక్టార్లు, పత్తి 2,464 హెక్టార్లు, వేరుశనగ 6,231 హెక్టార్లలో సాగు అవుతుందని అధికారుల అంచనా. గతేడాది కే6 కదిరి రకం వేరుశనగ విత్తనంతో సాగు చేసిన రైతులు దిగుబడులు రాకపోవడంతో నష్టపోయారు. పదిహేనేళ్ల క్రితం రూపొందించిన ఈ రకం విత్తనం మూలంగా రైతాంగానికి ఏమాత్రం లాభం లేదని, కొత్తరకం వంగడాలను ఈ ఏడాది వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫారసు చేశారు.

కొత్త వంగడాలు మేలు

టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి, కే1812 రకం వేరుశనగ విత్తనాలను రైతాంగం తమ పంట పొలాల్లో విత్తుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. హెచ్చుతగ్గుల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగి పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఈ కొత్త వంగడాలకు ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షా లు ఆశాజనకంగా ఉండడంతో జూన్ 15 నుంచి నెలాఖరు వరకు వేరుశనగ విత్తుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇందుకోసం రైతులకు కావాల్సిన మేలు రకం కొత్త వంగడాలను అందించేందుకు ప్రభుత్వం అన్ని రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచుతోందని వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు.

వేరుశనగ సాగుకే ఆసక్తి

ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో వేరుశనగ సాగుకే రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో 9,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని ప్రభుత్వానికి అధికారులు సిఫారసు చేశారు. మొదటి విడతగా 1,200 క్వింటాళ్లు విడుదలయ్యాయని, అదనంగా మరో 5,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రావాల్సి ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. 30 కేజీల వేరుశనగ విత్తనాల ప్యాకెట్‌ను ఎకరా పొలం ఉన్న రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. క్వింటాం వేరుశనగ ధర రూ.9,500 ఉండగా, 40 శాతం సబ్సిడీతో రైతాంగానికి ప్రభుత్వం అందజేస్తోంది.

గతేడాది నష్టపోయాం



కేవలం వర్షాధారంపైనే వ్యవసాయం ఆధారపడినందున సకాలంలో వర్షాలు కురవక నష్టపోయాం. విత్తన ఎంపిక, పంట సంరక్షణ, క్రిమిసంహారక మందులకు వెచ్చించిన మొత్తం కూడా బూడిదలో పోసిన పన్నీరైంది. పంట దిగుబడులు సక్రమంగా లేక రైతాంగానికి తీవ్రంగా నష్టపోవడం జరిగింది. ఈసారి కలిసివస్తుందని ఆశిస్తున్నాం.

– బోయ గంగప్ప, సర్పంచ్, మల్లెంపల్లి, డోన్ మండలం.

సకాలంలో విత్తనాలు అందిస్తాం



ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని శాస్త్రవేత్తలు అంచనా. రైతుకు అవసరమైన విత్తనాలను సకాలంలో అందిస్తాం. విత్తన ఎంపిక నుండి విత్తన శుద్ధి, పంట సంరక్షణకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే పంటల అధిక దిగుబడికి అవకాశం ఉంటుంది.

– అశోక్‌వర్ధన్‌రెడ్డి, సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ, డోన్.

వైభవంగా తిరుచ్చి వేడుకలు



మద్దిలేటిస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి తిరుచ్చి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, ఆలయ చైర్మన్ రామ చంద్రుడు వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు.

సీఎస్ఐ చర్చిలో ముగిసిన చిల్డ్రన్స్ క్యాంప్

బనగానపల్లె : స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ ఆల్బర్ట్ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ క్యాంపు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రెవరెండ్ ఆల్బర్ట్ మాట్లాడుతూ చర్చిలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక చిల్డ్రన్స్ క్యాంపులో పెద్దలతో ఏ విధంగా ప్రవర్తించాలి, దేవుడిపై భక్తి ఎలా ఉండాలి తదితర అంశాలను వివరించడం జరిగిందన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం డోన్ పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నాడు నేడు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వారిగా పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీర్లను సమన్వయంతో ముందుకు వెళ్లాలని హెచ్ఎంలకు సూచించారు. పాఠశాలలు పుఃన ప్రారంభం లోపల పనులను పూర్తవ్వాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప హెచ్ఎంలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్



బుగ్గానిపల్లె తండా జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 23న ప్రారంభమైన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తాండ జట్టు, డోన్ మండలం మల్కాపురం జట్టు ఫైనల్ పోటీల్లో తలపడ్డాయి. బుగ్గానిపల్లె తాండ జట్టు విన్నర్, చిన్న మల్కాపురం జట్టు రన్నర్ స్థానం కైవసం చేసుకోగా, 3వ స్థానాన్ని మండ్లవానిపల్లె జట్టు కైవసం చేసుకున్నాయి. విజేత జట్లకు వరుసగా రూ. 25 వేలు, రూ.10 వేలు, 5 వేలు చొప్పున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాండురంగయ్య, నాగరాజు, అయ్యస్వామి పాల్గొన్నారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ స్వరూప, ఉపాధ్యాయ బృందం

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులు డేవిడ్ నెహెమ్యా, కె పుల్లయ్య, టీఎండీ షరీఫ్‌ద్దీన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వరూపతో పాటు ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు వారికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ప్రతాప్, దస్తగిరి, జిల్లా సహ అధ్యక్షులు సత్యప్రకాష్, కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లకూ పాఠ్యపుస్తకాల సరఫరా



ప్రైవేట్ స్కూల్ యాజమాన్యల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లె రూరల్ : ప్రైవేట్ స్కూళ్లకు సైతం ప్రభుత్వమే పాఠ్యాపుస్తకాలను సరఫరా చేయడం జరుగుతుందని ఎంఈఓ స్వరూప తెలిపారు. శుక్రవారం స్థానిక ఎఈఓ కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్యను ఆన్‌లైన్ చేసి పాఠ్యాపుస్తకాలకు సంబంధించిన మొత్తం అమౌంట్‌లో 5శాతం చెల్లించాలన్నారు. మిగిలిన మొత్తాన్ని పుస్తకాలు సరఫరా అయ్యాక డిస్ట్రిబ్యూటర్‌కు చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభించేలోపు పాఠ్యాపుస్తకాలను ఆయా పాఠశాలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు శివరామమద్దిలేటి, ప్రసాద్, సుధాకర్, సుబ్బలక్ష్మీ, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : పట్టణంలోని సబ్ జైలును మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలు సూపరిడెంట్ రఘునాథరెడ్డితో కలిసి జైలు పరిసరాలు, వసతులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమైన జడ్జి భోజన సదుపాయాలు, వసతి, వైద్య సేవలు తదితర విషయాలపై ఆరా తీశారు. ఒక్కో ఖైదీతో మాట్లాడి జైలుకు రావడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బెయిలుకు దరఖాస్తు చేసుకున్నారా లేదా అని అడిగారు. స్వతహాగా బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వ తరుపున ఉచితంగా నియమించి న్యాయసేవలు అందిస్తామని ఈ సందర్భంగా జడ్జి తెలిపారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సరిత, కళ్యాణి, ఇందిర, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సురేంద్ర

సంజామల: ఉపాధి పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి అంబుడ్స్ పర్సన్ సురేంద్ర సూచించారు. మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో జరుగుతున్న పూడికతీత పనులను ఏపీఓ ప్రకాష్ రావుతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కొలతలకు అనుగుణంగా పనులు చేసుకుంటే వేతనం గిట్టుబాటు అవుతుందని ఆయన కూలీలకు సూచించారు. ఐదు ఎకరాల లోపు ఉన్నవారు నేలకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో పండ్లతోటలు పెంపకం చేపట్టాలని సూచించారు. అనంతరం ఏపీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్‌లతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జేఈ నాగలక్ష్మమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర



బనగానపల్లె ఎస్టీబీ కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

- సీఐ జయచంద్ర

సంజామల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రం సంజామల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ రమేష్ రెడ్డితో కలిసి సీఐ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసినందున ప్రతిఒక్కరూ స్నేహ భావంతో మెలగాలని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వాటిని వ్యక్తిగతంగా తీసుకోకూడదన్నారు. ఓట్ల కౌంటింగ్ రోజు 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ పకడ్బందీగా అమలు చేస్తామని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కౌంటింగ్ అయిపోయాక విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు నిషేధమన్నారు. విజయం సాధించామని సంబరాలు చేసుకున్నా, ఓడిపోయామని చట్టవిరుద్ధంగా వ్యవహరించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇతరులను రెచ్చగొట్టేలా వ్యవహరించినా, ప్రోత్సహించినా ఏ మాత్రం సహించమన్నారు. ఓట్ల లెక్కింపు రోజుల మండల, నియోజకవర్గ కేంద్రాలకు రాకుండా ఎవరి గ్రామాల్లో వారు ప్రశాంతంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4,ఆ తరువాత ఎలాంటి అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సాహించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని బీసీ, ఎస్టీఓ, పంచమపేట కాలనీల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరు బయటిరాకుండదని, సంబరాలు, ర్యాలీలు చేసేందుకు పోలీసుల అనుమతిలేదన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

డోన్ టౌన్ : జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌటింగ్ రోజు ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలని సీఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం రూరల్ సీఐ అస్రత్ బాషా, పట్టణ రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి పట్టణంలో టాం టాం వేస్తూ పోలీసు కవాతు నిర్వహించారు. నెహ్రూనగర్, తారకరామనగర్, ఇందిరానగర్, కొత్తపేట, పాతపేట కాలనీల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, ఎవ్వరైనా ప్రజల జీవనానికి భంగం కల్గించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌటింగ్ రోజు అనవసరంగా బయట తిరగరాదని, నలుగురు అంత కంటే ఎక్కువ మంది గుమికూడి ఒకే చోట ఉండరాదని హెచ్చరించారు. విజయోత్సవ సంబరాలు నిషేధమన్నారు. ఇతరులను రెచ్చగొట్టేలా ప్రేరేపించినా, ప్రోత్సహించినా లాఠీ రుచి చూపిస్తామని సీఐ హెచ్చరించారు.



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పాఠ్య పుస్తకాల మంజూరు

కొలిమిగుండ్ల: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడతలో 4284 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ అబ్దుల్ కలాం శుక్రవారం తెలిపారు. మండలానికి 16వేలకు పైగానే పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు మొదటి విడతలో 4,980, రెండో విడతలో 4,284తో కలిపి మొత్తం 9,264 పుస్తకాలు వచ్చాయన్నారు. వీటిని కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో ఉంచామని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులకు బెల్ట్‌లు మంజూరైనట్లు తెలిపారు.

సత్కారం



గంగిరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : పదవీ విరమణ పొందిన స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ గంగిరెడ్డిని శుక్రవారం తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. మండల విద్యాధికారి 2,హెచ్ఎం రామనర్సప్ప, ఉపాధ్యాయులు గంగిరెడ్డికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ఎస్ఎస్ బాబు, మాణిక్యంశెట్టి, రామచంద్రుడు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

కోవెలకుంట్ల: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. సమ్మర్ క్యాంపులో వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికేట్లు, పతకాలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాన్‌మేరీ హెచ్ఎం గీతా, పారిశ్రామిక వేత్త సుధీర్‌కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ హర్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని నాయిన్‌చెరువులో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం భువనేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్రమార్కులు చెరువును పూడ్చి వేస్తున్నారని తెలుసుకుని శుక్రవారం పార్టీలకు అతీతంగా చెరువు వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అనంతరం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చెరువు స్థలంలోని సర్వే నంబర్ 896లో అనంతపురం పట్టణానికి చెందిన పురుషోత్తం రెడ్డి అక్రమంగా వెంచర్ వేస్తున్నాడని వారు ఆరోపించారు. చెరువును పూడ్చి వేయడం ద్వారా చెరువు కింద ఉన్న నాలుగు బోర్లు, పైప్‌లైన్ దెబ్బతింటుందన్నారు. చెరువును పూడ్చడం వల్ల వర్షం నీరు రోడ్డుపైకి చేరుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెరువు స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తాన్ ఖాన్, బోరెడ్డి కృష్ణారెడ్డి, అంజి పాల్గొన్నారు.

యువతకు అండగా నిలిచిన నాగరాజు



ప్రిన్సిపాల్ నాగరాజును సన్మానిస్తున్న ఎంపీపీ చల్లా, ఉద్యోగులు

అవుకు: పదవీ విరమణ పొందిన అవుకు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజును శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డితోపాటు వివిధ ఐటీఐల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు నాగరాజుకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చల్లా మాట్లాడుతూ నాగరాజు వివిధ కంపెనీల ద్వారా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించి యువతకు అండగా నిలిచారని గుర్తు చేశారు. దివంగత చల్లా రామక్రిష్ణారెడ్డి చొరవతో అవుకులో ఏర్పాటైన ప్రభుత్వ ఐటీఐ కళాశాల పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని, ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడ్డాయని తెలిపారు.